క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

పాలసముద్రం: మండలంలో ఉదయం 9 గంటలు నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లోకేష్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు.

ఇరగాలమ్మకు ప్రత్యేక పూజలు


ఇరగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

శ్రీరంగరాజపురం: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పిల్లారికుప్పం పంచాయతీకి చెందిన మూలూరు గ్రామంలో వెలసిన ఇరగాలమ్మ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పొంగళ్లు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిరిపిరెడ్డి శ్రీనివాసులురెడ్డి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అండర్ బ్రిడ్జిలలోకి నీరు


బాధితుడిని మోసుకెళ్తున్న దృశ్యం


చెరువును తలపిస్తున్న తడుకు రైల్వే అండర్ బ్రిడ్జి

పుత్తూరు: తడుకు పంచాయతీ పరిధిలోని రెండు రైల్వే అండర్ బ్రిడ్జీలలో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా ఎగువగూళూరు, తడుకు వద్దనున్న రైల్వే అండర్ బ్రిడ్జీల్లో నీరు చేరడంతో ఎగువగూళూరు దళితవాడ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం ఎగువగూళూరుకు చెందిన ఎ.సుబ్రమణ్యం అనే వ్యక్తికి గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించడానికి నానా తంటాలు పడ్డారు. అండర్ బ్రిడ్జిలో నీరు నిలిచిపోవడంతో 108 వాహనం గ్రామంలోకి రాకపోవడంతో, సదరు బాధితుడిని స్ట్రెచర్‌పై గ్రామస్తులు అవతలి వైపునకు అతికష్టంపై తరలించారు. ఇలా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధిలో అవకతవకలకు అడ్డు

ఉపాధిహామీ పథక పనుల్లో పారదర్శకతకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. క్షేత్రస్థాయిలో జరిగే అవినీతికి చెక్ పెట్టేందుకు సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. ఉపాధి ఫలాలను అర్హులకు అందించాలనే సంకల్పంతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం పేరుతో నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. త్వరలో కొత్త యాప్ ద్వారా ముఖఆధారిత హాజరు విధానాన్ని ప్రారంభిస్తోంది. దీంతో బినామీ, బోగస్ మస్టర్లతో ఉపాధి నిధుల స్వాహాకు చెక్ పడనుంది.

–పాలసముద్రం


ఉపాధి హామీ కూలీలకు కొత్త యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఏపీఓ

- ఎన్ఎంఎస్ఎస్‌తో బినామీ మస్టర్లకు చెక్...
- ఇక ఉపాధిహామీ కూలీలకు ముఖాధారిత హాజరు
- రోజుకు రెండు పర్యాయాలు ఫొటోలు తీయాల్సిందే..
- కూటమి నాయకులు, ఫీల్డ్‌అసిస్టెంట్ల గుండెల్లో గుబులు

ఉపాధి హామీ పథకంలో బోగస్, బినామీ మస్టర్లతో కూటమి నాయకులతో కలసి క్షేత్రసహాయకులు పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేస్తుండడాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా అత్యాధునిక సాంకేతికతతో ఎన్ఎంఎస్ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను గ్రామ, మండల జిల్లా భౌగోళిక పరిస్థితిని సైతం అంచనా వేసేలా రూపొందించారు. ఇందులో గ్రామాల్లో చేపడుతున్న పనులకు సంబంధించిన ఫొటోలను ప్రతి రోజూ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే జాబ్‌కార్డు కలిగిన కూలీల ఫొటోలను ముందస్తుగా అప్‌లోడ్ చేస్తారు. ఉపాధి పనులకు కూలీలు హాజరైన సమయంలో యాప్ ద్వారా ప్రతి ఒక్కరి ఫొటో(ఐరిష్) తీయాలి. ఒకవేళ యాప్‌లో నమోదు చేసిన వ్యక్తి ఫొటోతో మ్యాచ్ అవ్వకుంటే నగదు చెల్లింపులు చేసేందుకు వీలుండదు. ఈ ప్రక్రియ ఒకరి బదులు మరొకరు పనులకు రాకుండా తోడ్పడుతుంది. అలాగే బోగస్ మస్టర్‌కు అడ్డుకట్ట వేస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యాప్‌ను ప్రవేశపెట్టేందుకు మండలాధికారు లు తమ పరిధిలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఉపాధి ఏపీఓ పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు యాప్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్నారు.

మండలం పేరు	ఉపాధి కూలీలు	జాబ్‌కార్డులు
గంగాధరనెల్లూరు	12151	7510
శ్రీరంగరాజుపురం	11584	6246
కార్వేటినగరం	7049	7049
వెదురుకుప్పం	12825	7548
పెనుమూరు	9242	5797
పాలసముద్రం	4950	3830

హాజరు ఇలా..

ఉపాధి కూలీల హాజరు తీసుకునే విధానంలో కూలీల ఫొటోలను సెల్ ఫోన్‌లో తీసుకుని ఎన్ఎంఎంఎస్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో రెండు సార్లు ఫీల్డ్ అసిస్టెంట్లు ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ సమయంలో ఒకరికి బదులు మరొకరు హాజరు చూపితే ఆన్‌లైన్‌లో కూలీల హజరు తీసుకోదు.

రెండు సార్లు నమోదు

ఉపాధి పనులకు కూలీలు హాజరైన సమయంలో మొదటి ఫొటోను ఉదయం 6 గంటలకు తీసి, అప్‌లోడ్ చేస్తే నాలుగు గంటల తరువాత అంటే ఉదయం 10 గంటలకు మరోసారి ఫొటోను అప్‌లోడ్ చేయాలని సిగ్నల్ వస్తుంది. ఉదయం 6 గంటలకు తీసిన ఫొటోతో పాటు 10 గంటలకు తీసిన ఫొటోను అప్‌లోడ్ చేయాలి. అలా చేయకపోతే ఆ రోజు కూలీలకు నగదు చెల్లింపులు ఉండవు. గతంలో కూలీలు పనులకు రాకపోయినా మస్టర్లు వేయడం, తమ బంధువుల పేర్లు నమోదు చేసి వారు పనులకు రాకపోయిన నగదు తీసుకుంటూ దోచుకున్న ఘటనలు ఉన్నాయి. అయితే కొత్తయాప్‌లో వాటికి గండి పడే పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు గతంలో పని బాధ్యతలు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి, తమకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకుని ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారు. కేంద్రప్రభుత్వం ప్రస్తుతం ఇలాంటి కొత్త యాప్‌ను తీసుకురావడంతో వారి గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లైంది.

కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రతి గ్రామానికి వెళ్లి ఉపాధిహామీ కూలీలకు సమావేశం నిర్వహించి ఉపాధిహామీ పథకంలో పనులు నాణ్యతగా చేయాలి. రోజుకి రెండు ఫొటోలు యాప్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మస్టర్‌లో పేరు ఉన్నవారే పనులు చేయాలి. బదులుకి చేయడాని వీలుకాదు. అలా చేస్తే నగదు రాదు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా రెండు సార్లు తీసిన ఫొటోలను తప్పకుండా అప్‌లోడ్ చేయాలి.

–మార్గరెట్, ఉపాధిహామీ పథకం, ఏపీఓ, పాలసముద్రం

రెండు సార్లు ఫొటోలు నమోదు



ఉపాధిహామీ కూలీలు హాజరైన సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉదయం 6 గంటలకు తీసి నాలుగు గంటల తరువాత మరో ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఫొటోలు ప్రతి ఒక్కరి (ఐరీష్) తీయాలి. ఒకవేళ యాప్‌లో నమోదు చేసిన వ్యక్తి ఫొటోతో మ్యాచ్ అవ్వకుంటే నగదు చెల్లింపులు చేసేందుకు వీలుండదు. అందుకే ప్రభుత్వం ఈ యాప్ తీసుకొచ్చింది. ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పని చేయాలి.

–సుబ్రమణ్యం, ఏపీడీ

అవకతవకులకు కళ్లెం



ఉపాధిహామీ పనుల్లో బోగస్ మస్టర్లు అరికట్టేందకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఎన్ఎంఎంఎస్ యాప్‌ను తీసుకొచ్చింది. త్వరలో యాప్‌ను ప్రారంభించనున్నాం. దీంతో ఉపాధి పనులు జరిగే చోట ఎలాంటి అవకతవకలకు అవకాశం ఉండదు. పని జరిగే చోట నాలుగు దిక్కుల్లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

–ఎస్.విద్యావతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ

12 అడుగులు పెరిగిన జీలుగ


అడుగులు పెరిగిన జీలుగ పంట


ఏపుగా పెరిగిన జీలుగను చూపుతున్న రైతు

నగరి: మండలంలోని కృష్ణారామాపురం గ్రామంలో 12 అడుగుల మేర పెరిగిన జీలుగ పంట అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. పంటను చూసిన వారు అంత ఎత్తుకు పంట ఎలా పెరిగిందంటూ రైతు వద్దకు వెళ్లి ఆరాతీస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల పంటలను భూసారం కోసం సాగు చేస్తున్నారు. ఐదో ఏడాది నవధాన్యాలు సాగు చేస్తున్నానని రైతు చంద్రశేఖర్ తెలిపారు. భూసారం భాగా పెరగడం, ఒత్తుగా, ఏపుగా వచ్చిన నవధాన్యాల పంట కారణంగా జీలుగ అంత ఎత్తుకు పెరిగిందని తెలుపుతున్నారు. రైతులు ఒక ఎకరాకు 20 కేజీల చొప్పున 25 రకాల విత్తనాలు చల్లుకుంటే భూమిలో ఇలా పోషకాలు పెరుగుతాయన్నారు.

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



గుడిపాల: మండలంలోని కందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వారి ఆలయంలో ఆగస్టు 15, 16 తేదీల్లో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు శుక్రవారం తెలిపారు. 15వ తేదీన శుక్రవారం భరణి, శనివారం కృత్తిక కావళ్లు ఉంటాయన్నారు. అదే రోజు మధ్యాహ్నం నుంచి అన్నదాన కార్యక్రమాలు రెండురోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. రాత్రి వీధినాటకంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వైభవంగా తెప్పోత్సవం

- తెప్పపై కొలువుదీరి భక్తులను కటాక్షించిన శ్రీవేణుగోపాలుడు


ఉభయదేవేరులతో కలసి పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవేణుగోపాల స్వామివారు

కార్వేటినగరం: టీటీడీ అనుబంధంగా ఉంటున్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి తెప్పోత్సవ వేడుకలు మూడో రోజు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన తదితర నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల విరాట్‌ను పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి పుర వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్కంధ పుష్కరిణిలో ఏర్పాటు చేసిన తెప్పపై ఉభయ దేవేరులతోపాటు శ్రీవేణుగోపాలుడు 9 పర్యాయాలు విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ క్రమంలో భాగంగా స్కంధ పుష్కరిణిలో భక్తులు కర్పూర నీరాజనాలు వదలి, గోవింద నామస్మరణలు చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, ఆలయ అధ్యక్షుడు సురేష్‌కుమార్, టీటీడీ వేద పండితులు శబరీష్, గోపాలాచారి, రమేష్, షరాబు బాబుసురేష్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవం

- సీఆర్‌కండ్రిగలో ఆధ్యాత్మిక శోభ


ముస్తాబైన వరసిద్ధి వినాయక ఆలయం

వెదురుకుప్పం: మండలంలోని సీఆర్‌కండ్రిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం కుంభాభిషేక మహోత్సవానికి ముస్తాబైంది. శనివారం నుంచి కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఎం.రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చెప్పారు. శనివారం 5 గంటలకు గంగపూజ, మృత్సంగ్రహణం, గోపూజ, మహాగణపతి, నూతన విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం వేదపారాయణం, ప్రధాన కలశ స్థాపన, రుద్రాభిషేకం, సాయంత్రం హోమ పూజలు ఉంటాయన్నారు. సోమవారం ఉదయం కుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాత్రి ద్రౌపదీ మాన సంరక్షణ వీధి నాటక ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మూడు రోజులూ భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం




శ్రీమహాలక్ష్మి అమ్మవారికి తిరుమంజనం, వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న దంపతులు, వెదురుకుప్పం: చవటగుంటలో పూజలు

కార్వేటినగరం: వరలక్ష్మీ వ్రతం వేడుకలను మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ అనుసంధానంగా ఉన్న శ్రీసంతాన వేణుగోపాల స్వామివారి ఆలయ ఆవరణంలో వెలసి ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే ఆవరణలో ఉన్న ఊంజల్ మండపం వద్ద అమ్మవారికి టీటీడీ వేదపండితులు వేద మంత్రాల నడుమ పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో దంపతులు అమ్మవారి వ్రతంలో పాల్గొన్నారు. భక్తులకు టీటీడీ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు, గాజులు, పసుపు, కుంకుమ తదితర సామగ్రిని అందించారు. మండల కేంద్రంలో వెలసి ఉన్న శ్రీదౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షురాలు మోహనకుమార్ ఆధ్వర్యంలో వెయ్యి మందికి వరలక్ష్మీ వ్రతం పూజా సామగ్రిని అందించారు. దీంతో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు గాజులు, జాకెట్లు, లక్ష్మీదేవీ చిత్రపటాన్ని అందించారు. మధ్యాహ్నం వెయ్యి మందికి అన్నదానం చేపట్టారు. అదే విధంగా మండలంలోని ఆళత్తూరు సమీపంలో వెలసి ఉన్న ముత్యాలమ్మ, బంగారమ్మ, పడివేటమ్మ ఆలయాల్లో కూడా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని నోచుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ద్రౌపదీదేవి అలయ కమిటీ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలో వరలక్ష్మీ వ్రతం పూజలను మహిళలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పూజ గదుల్లో బియ్యం పోసి గౌరమ్మతల్లిని వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ముత్తయిదువులకు జాకెట్, పసుపు, కుంకుమ, సారెను మహిళలు అందించారు.

నింద్రలో..

నింద్ర: మండలంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం పండుగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రమైన నింద్రలో వినాయక ఆలయంలో ఉదయం వరలక్ష్మి దేవతను ప్రతిష్ఠించి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కూనమరాజు పాళెం గ్రామం, అరూరు, అత్తూరు గ్రామాల్లో పూజలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కేఆర్‌పాలెంలో వరలక్ష్మీ వ్రతం, వరలక్ష్మీవ్రతం చేస్తున్న మహిళలు

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై కొలువైన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో వరలక్ష్మీవ్రత పూజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. అదేవిధంగా చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహిళలు పెద్ద ఎత్తున వ్రతాన్ని ఆచరించారు. మహిళలు తమ ఇళ్లల్లోనే అమ్మవారి ప్రతిమను ఉంచి ప్రత్యేక అలంకరణలు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేసి అమ్మవారిని వేడుకున్నారు.

శివసాయి మందిరంలో..

నగరి: తడుకుపేట గ్రామంలోని శివసాయి మందిరంలో వరలక్ష్మీ వ్రతం వేడుకలను సత్యసాయి భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయాన్ని పుష్పాలతో అలంకరించి మహిళలు వరలక్ష్మీవ్రతం చేస్తూ కుంకుమ పూజ నిర్వహించారు. బాలవికాస్ విద్యార్థులు ఈ సందర్భంగా భజనలు, కీర్తనలు ఆలపించారు. సత్యసాయి భజన మండలి కన్వీనర్ వెంకటరమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



నగరి: పట్టణ పరిధిలోని తన నివాసం వద్ద మాజీ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆచారం ప్రకారం గోవుకు పసుపు, కుంకుమలు పెట్టి గోపూజ చేశారు. గోవుకు ఆహారం పెట్టి ప్రార్థించుకున్నారు. అనంతరం వరలక్ష్మీ వ్రతాన్ని వేదమంత్రోచ్చారణ మధ్య ఆచరించారు. వరలక్ష్మి వ్రతం రోజున ఆడపడుచులందరికీ సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.


మాజీ మంత్రి ఇంటిలో వరలక్ష్మీవ్రతం, గోవు పూజలో మాజీ మంత్రి ఆర్కే రోజా

అట్టహాసంగా అర్జున తపస్సు

- వైభవంగా ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు
- తపస్సుమాను అధిరోహించిన అర్జునుడు
- అర్ధరాత్రి అలుగు ఉత్సవం


కామాక్షీ సమేత సదాశివేశ్వరుడి ఊరేగింపు

పుత్తూరు: ద్రౌపదీదేవీ సమేత ధర్మరాజుల స్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. చివరి అంకంలోని తొలి రోజైన శుక్రవారం అర్జునుడి తపస్సును మెచ్చిన పరమశివుడు పాశుపతాస్త్రం నొసంగే ఘట్టం ఆద్యంతం భక్తులను ఆకట్టుకొంది. ఈ క్రమంలో ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు, మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకొంది. గెరిగ నీటితో అమ్మవారిని అభిషేకించి వరలక్ష్మీదేవి అలంకరణ చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ సర్వభూపాల వాహన ఉత్సవం కనుల పండుగగా జరిగింది. ఉదయం 10 గంటలకు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరుడు అధికార నంది వాహనంపై ఆశీనులై, మంగళవాయిద్యాలు, బాణాసంచా నడుమ అడుగడుగునా భక్తజన మంగళ హారతుల నడుమ ఊరేగింపుగా ద్రౌపదీదేవి ఆలయానికి చేరుకొన్నారు. అక్కడ పరమశివుడు నుంచి అర్జునుడు పాశుపతాస్త్రాన్ని పొంది, తపస్సు మాను అధిరోహించిన ఘట్టం అందరినీ అలరించింది. మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక ఎలక్ట్రికల్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం 4 గంటలకు గుండ్లపుత్తూరు గ్రామస్తులు ఉత్తర గోగ్రహణం ఘట్టాన్ని నిర్వహించారు. రాత్రి 9గంటలకు పట్టణ పురవీధుల్లో స్వామి అమ్మవార్లు ఊరేగుతూ స్థానిక రైల్వే స్టేషన్ వద్దకు చేరుకున్నారు. రైల్వే ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక బాణాసంచా వేడుకలు నిర్వహించారు. అనంతరం పాటకచ్చేరి వీనుల విందుగా సాగింది. అనంతరం పుత్తూరు లారీ ఓనర్స్ సంఘం ఆధ్వర్యంలో వరలక్ష్మీదేవి ద్రౌపదమ్మ విమాన మహోత్సవం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు బలిజ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ద్రౌపదీ తీర్థం అనబడే మంచి నీళ్ల గుంట వద్ద అలుగును ప్రత్యేకంగా అలంకరించి, బాణాసంచా, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలో స్వామి, అమ్మవార్ల సమక్షంలో కుంభాగ్రంపై (పచ్చికుండపై 4 అడుగుల కత్తిని తలకిందులుగా నిలబెట్టుట) అలుగును నిలబెట్టారు. రాత్రి 12 గంటలకు కుమ్మర సంఘం ఆధ్వర్యంలో కాళికాదేవికి ఇలావంతుని బలి ఇచ్చారు.

బ్రహ్మోత్సవాల్లో పటిష్ట భద్రత

ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో పుత్తూరు డీఎస్పీ జి.రవికుమార్ నేతృత్వంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఉదయం సదాశివేశ్వరస్వామి ఊరేగింపు, అర్జున తపస్సు కార్యక్రమాలు పోలీసుల బందోబస్తు నడుమ చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక రైల్వే స్టేషన్ వద్ద డీఎస్పీ రవికుమార్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ వద్ద రాత్రి భారీగా జరిగే బాణాసంచా సందర్భంగా, తర్వాత జరిగే పాటకచ్చేరి సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. పోలీసులతోపాటు స్థానిక స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు మాస్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సేవలందించారు.


అర్జునుడిచ్చే ప్రసాదం కోసం వరపడిన మహిళలు

నేడు రథోత్సవం

శనివారం ఉదయం 9 గంటలకు గరుడసేవ, శ్రీకృష్ణరాయబారం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు దుర్యోధన వధ, పాండవ విజయం. 4గంటలకు శ్రీకృష్ణ రథం, గజ, తురగ, పదాతులు ముందు నడుస్తుండగా పాండవులు మహారథాన్ని అధిరోహించి విహరించనున్నారు.

పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించండి

చిత్తూరు కార్పొరేషన్: దొడ్డిదారిలో పౌరసత్వ చట్టసవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు విమర్శించారు. శుక్రవారం నగరంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. బీహార్‌లో అడ్డదారిలో గెలవాలని ఎన్నికల సంఘంపై ఒత్తిడి తీసుకువచ్చి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు బీజేపీ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. పౌరులు ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఇందులో ఉన్నాయన్నారు. ఓటర్ లిస్టులను మార్చేసి బిహార్‌లో లక్షలాది మందికి ఓటు హక్కు తొలగించడం దారుణమని విమర్శించారు. కొన్నేళ్ల కిందట దేశవ్యాప్తంగా ప్రజలు తిరస్కరించిన పౌరసత్వ చట్ట సవరణలు సీఏఏ, జాతీయ పౌరసత్వ రిజిస్టర్ ఎన్‌సీఆర్ చట్టాలను ఎస్ఐఆర్ పేరుతో దొడ్డిదారిన అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అందుకే కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆయుధంగా చేసుకుందని విమర్శించారు. జ్యోతిరావు పాల్గొన్నారు.

దసరా బ్రహ్మోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని దుర్గాంబ దేవస్థానంలో శుక్రవారం దసరా బ్రహ్మోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి ఈ పత్రాన్ని ఆవిష్కరించి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.